క్లుప్తంగా

ఘనంగా నూకాలమ్మ తీర్థం


బిక్కవోలు గ్రామదేవత నూకాలమ్మ

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలు గ్రామదేవత నూకాలమ్మ తీర్థం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి జరిగిన అమ్మవారి జాతరలో గరగ నృత్యాలు, తీన్‌మార్ డప్పులు, వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. శనివారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గోగులమ్మకు పండ్లతో అలంకరణ


ప్రత్యేక అలంకరణలో గోగులమ్మ

పెదపూడి: జి.మామిడాడ గ్రామం శివారు ఎల్‌ఎన్‌పురంలో పాటిమీద కొలువైన గోగులమ్మ అమ్మవారిని పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఏటా ఉగాదికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. దానిలో భాగంగా అమ్మవారికి ఇలా అలంకరణ చేశారు. ఆలయం వద్ద ఆదివారం సుమారు 8 వేల మందికి అన్నసమారాధన చేయనున్నారు. స్థానికులతో పాటు పెద్దాడ, రాజుపాలెం, సామర్లకోట మండలం జి.మేడపాడు, పైన, ఊలపల్లి తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు.

సుబ్బారెడ్డికి ఉగాది పురస్కారం



పెదపూడి: రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉగాది పురస్కారానికి అనపర్తి రామకృష్ణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి సుబ్బారెడ్డి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని సేవాసమితి ప్రతినిధి దుర్గాప్రసాద్ శనివారం విలేకరులకు తెలిపారు. సమితి ప్రధాన కార్యదర్శిగా సమాజానికి సుబ్బారెడ్డి అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం వరించిందన్నారు. గత 23 ఏళ్లుగా స్వామి వివేకానంద భావజాలాన్ని యువత, విద్యార్థులకు అందిస్తూ, వారిలో చైతన్యాన్ని తీసుకువస్తున్నామన్నారు. విజయవాడలో ఆదివారం జరిగే ఉగాది వేడుకల్లో సుబ్బారెడ్డి పురస్కారం అందుకుంటారన్నారు.

డిగ్రీ కళాశాలకు కుర్చీల వితరణ


కుర్చీలు అందజేస్తున్న అధ్యాపకులు

సీతానగరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అధ్యాపకులు 50 కుర్చీలను వితరణ చేశారు. అధ్యాపకులు డాక్టర్ డీవీ నాగేశ్వరరావు (ఎకనామిక్స్), డాక్టర్ ఎం.సుధామయి (తెలుగు), బి.మాధవ్ (కెమిస్ట్రీ), ఎస్‌డీ మదీనా (కామర్స్) వీటిని సమకూర్చారు. విద్యార్థులు కూర్చుండేందుకు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబుకు అందించారు.

కుట్టుమిట్టాడుతూ..


మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న రెడీమేడ్ దుస్తులు


మండలంలోని ఓ టైలరింగ్ షాపు

- టైలర్లకు తగ్గిన ఆదరణ
- అరకొర ఆదాయం
- పెరిగిన రెడీమేడ్ దుస్తుల వినియోగం

సీతానగరం: యాంత్రీకరణ, రెడీమేడ్ దుస్తుల విజృంభణతో టైలర్ల పరిస్థితి దారుణంగా మారింది. దుస్తులను కుట్టించుకునే వారు బాగా తగ్గిపోవడంతో అరకొర ఆదాయంతో అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో కుట్టు పనినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ మంది రెడీమేడ్ దుస్తుల వైపు మొగ్గు చూపడం, కుట్టు చార్జీల ధరకే షాపుల్లో దుస్తులు లభించడంతో చాలామంది టైలర్ షాపులకు వెళ్లడమే మానేశారు. లేడీస్ టైలర్లను మినహాయిస్తే జంట్స్ స్పెషలిస్టుల పరిస్థితి దయనీయంగా మారింది.


పట్టించుకోని పాలకులు

నియోజకవర్గంలో అనేక మంది టైలర్లు కుట్టుపనిపై ఆధారపడి బతుకుతున్నారు. వీరిలో షాపుల నిర్వహిస్తున్న వారితో పాటు ఇంటి వద్ద దుస్తులు కుట్టే లేడీస్ టైలర్లు కూడా ఉన్నారు. ఎన్నో ఏళ్లుగా కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న దర్జీలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల పాటు వరుసగా వైఎస్సార్ చేదోడు పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. దీంతో అప్పట్లో దర్జీ వృత్తి వదిలి ఇతర పనులకు వెళ్లిన వారంతా మళ్లీ కుట్టు పని చేసుకుండేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దర్జీలను పట్టించుకునే వారే కరవయ్యారు. చేదోడు వంటి సాయం కూడా అందక నిన్నటి వరకు దర్జీలుగా పని చేసిన వారంతా మళ్లీ కూలి పనులకు వెళ్లాల్సి వస్తోంది.

కుట్టుమెషీన్ల కనుమరుగు

ప్రస్తుతం అన్ని వర్గాల వారికీ రెడీమేడ్ దుస్తులు అందుబాటులోకి వచ్చాయి. సరికొత్త డిజైన్లతో టీ షర్టులు, జీన్స్ ప్యాంట్లు, రెడీమేడ్ పంచెలు మార్కెట్‌లో ఉన్నాయి. దీంతో ఎక్కువ మంది రెడీమేడ్‌పై మక్కువ చూపుతుండటంతో టైలర్లకు ఉపాధి కరవవుతోంది. దుస్తుల తయారీ ముడి సరకు ధరలు పెరగడంతో గిట్టుబాటు అవ్వక దర్జీలు ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అందించినట్లుగా ప్రభుత్వ దర్జీలను ఆదుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



రెడీమేడ్ దుస్తుల రాకతో మేము ఉపాధిని కోల్పోయాం. మాకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్పిటళ్లు, ఇతర ప్రభుత్వ రంగాలలో యూనిఫాం కుట్టే పనులను పాలకులు అప్పగించాలి. గత ప్రభుత్వ అందించిన వైఎస్సార్ చేదోడు మాదిరిగా ఏడాదికి రూ.పది వేల సాయం అందజేయాలి.

– నాగిశెట్టి వీరబాబు, టైలర్, రఘుదేవపురం

ఆదరణ కరవు



టైలరింగ్ వృత్తిలో సుమారు 42 ఏళ్లుగా కొనసాగుతున్నాను. రెడీమేడ్ దుస్తుల రాకతో మాకు పని బాగా తగ్గిపోయింది. ఇదే వృత్తిని నమ్ముకొని, మరో పని తెలియక జీవనం సాగిస్తున్న మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి. ప్రభుత్వ రంగాల్లో మాకు ఆర్డర్లు ఇప్పించాలి.

– షేక్ సయ్యద్ బాజీ, టైలర్, సింగవరం

నేటి నుంచి వసంత నవరాత్ర మహోత్సవాలు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని బుడిత మామిడి వద్దగల వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఏప్రిల్ 7వ తేదీ వరకూ వసంత నవరాత్ర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు మల్లిడి కోదండ బ్రదర్స్ తెలిపారు. ఈ తొమ్మిది రోజులూ అభిషేకాలు, పూజలు, అలంకరణ జరుగుతాయన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

రాజానగరం: ఆడ పిల్లల రక్షణ కోసం ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలపై బాల్యం నుంచి అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రెడ్డి ప్రసన్న అన్నారు. స్థానిక పోలీసు స్టేషను పరిధిలోని ఈఏఆర్ స్కూల్‌ను శనివారం సందర్శించిన ఆమె పోక్సో చట్టంపై బాలికలకు అవగాహన కల్పించారు. కౌమార దశలోని బాలికలు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు.

మండల సమావేశంలో సమస్యల వెల్లువ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో స్వామినాయక్

సీతానగరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం.భారతి, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, వైస్ ఎంపీపీ – 2 సత్యం మదన్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఎంఈవో కె.స్వామినాయక్ మాట్లాడుతూ ఈ నెల 31న జరగాల్సిన పదో తరగతి పరీక్షను ఏప్రిల్ ఒకటికి వాయిదా వేశారన్నారు. నాడు – నేడులో అసంపూర్తిగా నిలిచిన పనులకు వచ్చే నెలలో నిధులు మంజూరవుతాయని, పనులు ప్రారంభిస్తామని తెలిపారు. సర్పంచ్ కోండ్రపు ముత్యాలు మాట్లాడుతూ సొంత స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి చాలా మంది సుముఖంగా ఉన్నారని, ఎప్పుడు మంజూరు చేస్తారని ప్రశ్నించారు. దీనిపై హౌసింగ్ ఏఈ నాగ చక్రం మాట్లాడుతూ మండలంలో 665 మంది సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి దరఖాస్తు చేసుకున్నారని, ఆ ఇళ్లు ఇంకా మంజూరు కాలేదన్నారు. మునికూడలిలో 11 కేవీ విద్యుత్ లైన్ ఇళ్లపై నుంచి వెళ్లిందని, దాన్ని తొలగించాలని సర్పంచ్ కోరారు. దీనిపై ట్రాన్స్ కో ఏఈ చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యుత్ లైన్ వేసిన తర్వాత ఇళ్లు కట్టుకున్నారని, నిధులు మంజూరైన తర్వాత తొలగిస్తామన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ కేవీఎస్‌ఎస్ మూర్తి, ఏవో సుబ్రహ్మణ్యం, సీనియర్ అసిస్టెంట్ గోపాల్ (సీఎం), సతీష్, చల్లమళ్ల సుజీరాజు, మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జక్కంపూడి రాజా పరామర్శలు


బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: మండలంలోని పలు బాధిత కుటుంబాలను, అనారోగ్యంతో చికిత్స పొందిన వారిని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా శనివారం పరామర్శించారు. పాలచర్లలో సాదే లక్ష్మణరావు కుటుంబ సభ్యులను, వెలుగుబందలో బుర్రా సత్యనారాయణ కుటుంబ సభ్యులను కలుసుకుని తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే గుండె ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న పాలచర్లకు చెందిన రావూరి నాగేశ్వరరావును, ప్రమాదంలో చేయి విరిగి, చికిత్స చేయించుకుని ఇంటి వద్దనే విశ్రాంతి పొందుతున్న దివాన్‌చెరువుకు చెందిన బొల్లేపల్లి వీరభద్రరావును పరామర్శించారు. అగ్నిప్రమాదంలో హోటల్ కాలిపోయిన వెలుగుబంద జగనన్న కాలనీలోని కప్పల నాగమణితో మాట్లాడారు. ప్రమాదం గురించి తెలుసుకుని, అన్ని విధాలా అండగా ఉంటామంటూ మనోధైర్యాన్నిచ్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ స్థానిక నాయకులు ఉన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు

కోరుకొండ: ఫార్మసీ విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉందని కేజేఆర్ ఫార్మసీ కాలేజీ చైర్మన్ డాక్టర్ వీరవల్లి డానియేల్ రవీంద్ర సుందర్ అన్నారు. కోరుకొండ మండలం బూరుగుపూడి కేజేఆర్ కాలేజీలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఔషధాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలన్నారు. 2004లో ప్రారంభమైన తమ కళాశాల నుంచి ఇప్పటి వరకూ 1,200 మంది డీఫార్మసీ, 900 మంది బీఫార్మసీ, 300 మంది ఎంఫార్మసీ ఉత్తీర్ణులయ్యారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్పీ ప్రీతి ప్రియదర్శిని, ఏఓ శరత్‌చంద్ర బ్రహ్మ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షకు 76 మంది హాజరు

రంగంపేట: వడిశలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యార్థులకు ఎలక్ట్రానిక్ పరీక్ష జరిగినట్టు మండల విద్యాశాఖాధికారి పి.మధుసూదనరావు తెలిపారు. మొత్తం 76 మందికి పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. రంగంపేట, సింగంపల్లి కేంద్రాల్లో ఈ సాంకేతిక పరీక్షలు జరగలేదన్నారు.

‘నన్నయ’లో ఉగాది పురస్కారాల ప్రదానం


ఆచార్య జార్జి విక్టర్ దంపతులను సత్కరించి, సన్మాన పత్రాన్ని అందజేస్తున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: విశ్వవసు నామ సంవత్సర ప్రారంభం సందర్భంగా ఆదికవి నన్నయ యూనివర్సిటీలో శనివారం పలువురు ప్రముఖులకు ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ వీసీ ఆచార్య జార్జి విక్టర్‌కు ఉగాది పురస్కారాన్ని అందించి, యూనివర్సిటీ అభివృద్ధికి ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా జార్జి విక్టర్ దంపతులను సత్కరించి, జ్ఞాపిక, సన్మాన పత్రికను అందజేశారు. యూనివర్సిటీలో వివిధ విభాగాలలో విశిష్ట సేవలందించిన వీజీఆర్ శేఖర్, పీఏ రవికిరణ్, కె.శివరంజని, షేక్ బాబ్జీ, పి.ప్రేమచంద్, కె.దేవలాల్, ఎంసీహెచ్. దుర్గారావు, పి.గోవిందరాజులు, పి.సోమరాజు, ఎస్.దుర్గాప్రసాద్, బి.రాఘవులు, పి.శ్రీను, ఎస్.నాగేశ్వరరావు, యు.శ్రీనుబాబు, ఎ.కిరణ్ కుమార్, పి.వీరలక్ష్మి, వై.దుర్గాప్రసాద్, బి.నరసింహమూర్తి, ఎండీ మల్లిక, షేక్ బేబీ, పి.రాజీవ్, జి.సూర్యకుమారి, కరీం తదితరులను సన్మానించి, పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, వివిధ విభాగాలకు చెందిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పట్టాల ప్రదానం


విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు

రాజానగరం: అవసరం మేరకు వైద్యులు లేని ప్రాంతాలలో నర్సులు, ఏఎన్‌ఎంలే ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. స్థానిక జీఎస్‌ఎల్ వైద్య కళాశాలలో శనివారం నిర్వహించిన జీఎస్‌ఎల్, స్వతంత్ర నర్సింగ్ కళాశాలల లాంప్ లైటింగ్, ఓత్ టేకింగ్, గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏపీఎన్‌ఎంసీ రిజిస్ట్రార్ కొత్తపల్లి సుశీల మాట్లాడుతూ వృత్తిపరంగా నైపుణ్యాలతో పాటు రోగులకు మెరుగైన సేవలందించుటలో అవసరమైన సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో జీఎస్‌ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్తెమ్మ తల్లి గ్రామోత్సవం

పెదపూడి: కరకుదురులో నిర్మించిన సత్తెమ్మ తల్లి ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవాన్ని సోమవారం ఉదయం 9.26 గంటలకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు, వైఖానస పీఠం వ్యవస్థాపకుడు వాడపల్లి గోపాలాచార్యులు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సానికి ముందుగా అమ్మవారి గ్రామోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ రోజున ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వెదుళ్ల సత్తిరాజు, వరలక్ష్మి దంపతులు, పెద్దాడ సాగునీటి డీసీ చైర్మన్ సానా శ్రీనివాసు, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ, మాజీ సర్పంచ్ సింగిసీడి నాగ తిరుపతిరావు, పాటంశెట్టి త్రిమూర్తులు, ఆలయ కమిటీ నేతలు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: సింగవరం ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కడలి నాగమణి కుమారిపై దాడి చేసిన ఈలి నాగలక్ష్మి, ఈలి లావణ్యపై కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ గోవిందరాజులు తెలిపారు. వివరాల్లోకి వెళితే. స్కూల్ ఆవరణలోని మామిడి చెట్టు కాయలను శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో నాగలక్ష్మి, లావణ్య కోయసాగారు. ఎందుకు కోస్తున్నారని ప్రశ్నించిన హెచ్‌ఎం నాగమణి కుమారిపై దాడి చేశారు. ఎలా ఉద్యోగం చేస్తావో చూస్తామంటూ బెదిరించారు. దీంతో హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బెల్లపు ఊట ధ్వంసం

రంగంపేట: స్థానిక ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సారా స్థావరాలపై శనివారం దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.









